# ఆదిలోనే హంసపాదు

- తొలకరి పంటకు ఎలుకల బెడద
- అధిక వ్యయాలపై రైతుల ఆందోళన

**కాజులూరు:** 'గోరుచుట్టుపై రోకలిపోటు' అన్న చందగా ఉంది నియోజకవర్గంలోని రైతుల పరిస్థితి. ఈ ఏడాది తొలకరి సాగు తొలిదశ నుంచి వర్షాలు సరిగా కురవకపోవడంతో నారుమడులు మొలక శాతం తగ్గిపోయింది. దీంతో నారుకొరత ఏర్పడగా దానిని అధిగమించేందుకు రైతులు నానాఅవస్థలు పడ్డారు. పొలంలో మొక్కల సంఖ్య తగ్గడంతో ఎగువ ప్రాంతాల నుంచి నారు తీసుకువచ్చి చెదురుమదురుగా నాట్లు వేసుకున్నారు. అయితే ఇప్పుడిప్పుడే దుబ్బుకడుతున్న వరిపంటపై ఎలకలు దాడి చేసి మొక్కలను కొరికివేస్తుండటంతో వాటిని అదుపు చేయలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 67 వేల ఎకరాల సాగు భూమి ఉండగా ఈ ఏడాది 52 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. అధికశాతం పొలాల్లో రైతులు నాట్లు పూర్తి చేయగా పంట దుబ్బుకట్టే దశలో ఉంది. ప్రస్తుతం పొలాల్లో ఎలక కొట్టుడు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రసాయన మందులు వాడినా ఎలుకలు నిర్మూలన సాధ్యం కాకపోవడంతో పంటలను రక్షించుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసలకు గురై వాటిని మట్టుపెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ముందుగా ఊడ్చిన పొలాల్లోనూ, వెదజల్లిన పొలాల్లోనూ ఎలుకలు ఎక్కువగా వరిమూనలు నాశనం చేస్తున్నాయని రైతులు అంటున్నారు. ఎలుకల నివారణకు వరినూకలకు తగిన మోతాదులో రసాయన మందును కలిపి పొట్లాలు కట్టి పొలాల్లోని గట్లపై ఉండే ఎలుకల బొరియల వద్ద ఉంచేవారు. ఎలుకల ఉధృతి అధికంగా ఉండటంతో ఇటీవల ఈ విధానం ఫలితాలను ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం రైతులు ఎలుకల బుట్టలు ఉపయోగించటం, పొగపెట్టడం ద్వారా నివారణ చర్యలు తీసుకుంటున్నారు. బుట్టలు పెట్టే విధానంలో ఎరగా ఉంచిన ధాన్యం గింజలు తినడానికి వచ్చిన ఎలుక ప్రత్యేకంగా అమర్చిన ఎదురు కర్రల మధ్య చిక్కుకుని మరణిస్తుంది. పొగపెట్టే పద్ధతిలో ఎలుకలు తిరగాడే ప్రాంతాలు గుర్తించి అక్కడ కొంతమేర తవ్వి కుండలో గడ్డి ఉంచి నిప్పు పెట్టి పొగ వచ్చేలా చేసి కన్నం వద్ద ఉంచుతారు. ఆ పొగకు కన్నంలో ఉన్న ఎలుక ఊపిరాడక చనిపోతుంది. ఎలుక ఉన్న ప్రాంతంలో లోతుగా కన్నం తవ్వి చేతితో పట్టుకుని చంపేస్తారు. ఈ విధానాల ద్వారా చంపిన ఒక్కో ఎలుకకు రూ.60 చొప్పున తీసుకుంటారు. నియోజకవర్గ గ్రామాల్లో ఎలుకలు పట్టేవారికి డిమాండ్ పెరగడంతో ఒక్కోమారు ఎలుక పట్టుకునే ధర పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. రామచంద్రపురం, కాజులూరు, కె.గంగవరం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో మెట్టప్రాంతాల నుంచి ఎలుకలు పట్టుకునేందుకు వచ్చిన వారు కొందరు గ్రామాల్లో రైతులను కలుసుకుని ఎలుకలు చంపడానికి ఒప్పందం కుదుర్చుకుంటారు. ఎకరానికి రూ.మూడువేలు చొప్పున బేరమాడుకుని ఆ పంటకాలంలో పూర్తయ్యే వరకు ఎలుకలను చంపుతున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎలుకల నిర్మూలన పూర్తిగా సాధ్యం కాకపోవడంతో అవి దిగుబడిపై ఏ విధంగా ప్రభావం చూపుతాయోనని రైతులు కలవరపడుతున్నారు.


కాజులూరులో పొలంగట్టుపై పొగపెట్టి ఎలుకలను చంపుతున్న దృశ్యం


పొగపెట్టి సంహరించిన ఎలుకలు (అంతరచిత్రం)

### పంట నాశనమౌతోంది



ఎలుకల దాడికి గురయితే వరి పంట సర్వనాశనమవుతుంది. మార్కెట్‌లో దొరికే ఖరీదైన మందులు వాడినా అవి తినడం లేదు. ఎలుకలు వరి దుబ్బులను మొదలకు కొరికి పారవేస్తుండటంతో మొక్క పూర్తిగా చనిపోతుంది. ఫలితంగా ఎకరానికి సుమారు 10 బస్తాల పైబడి దిగిబడి తగ్గిపోతుంది.

– గోవాల కామరాజు రైతు గొల్లపాలెం

### ప్రభుత్వ సహకారమందించాలి



వరి పంటపై ఎలుకల దాడి వలన అధికవ్యయాలకు గురికావలసి వస్తుంది. మార్కెట్‌లో దొరికే ఖరీదైన మందులు వాడినా అవి తినడం లేదు. ప్రభుత్వం స్పందించి ఎలుకలు చనిపోయే విధంగా మందులను పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలి.

– గంజా సూరిబాబు, రైతు చేదువాడ

## పాఠశాలకు సంగీత వాయిద్య పరికరాల వితరణ


రాయవరంలో పాఠశాలకు సంగీత వాయిద్య పరికరాలను అందజేస్తున్న సతీష్‌రెడ్డి

**రాయవరం:** స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి సంగీత వాయిద్య పరికరాలను అందజేశారు. పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీపెరంబుదూర్ సూరిబాబుకు 1987–92 బ్యాచ్‌కు చెందిన కర్రి సతీష్‌రెడ్డి రూ.10వేలు విలువైన సంగీత వాయిద్య పరికరాలను అందజేశారు. పాఠశాల అసెంబ్లీ, స్కౌట్ అండ్ గైడ్స్ నిర్వహణ సమయంలో వాటిని వినియోగిస్తామని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం తెలిపారు. ఉపాధ్యాయుడు గొలుగూరి వీరాంజనేయరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**కపిలేశ్వరపురం (మండపేట):** ఏడిద గ్రామంలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు శనివారం తెలిపారు. ఏడిద రోడ్డు సబ్ స్టేషన్‌లో, గ్రామాల్లోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరాను నిలిపివేయనున్నామన్నారు. ఏడిద, ఏడిద సావరం, ఏడిద సీతానగరం, ఏడిద కొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రత్నాలరావు తెలిపారు.

## క్లుప్తంగా

### డిగ్రీ కళాశాలలో రేపు వైద్య శిబిరం

**కపిలేశ్వరపురం (మండపేట):** మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12న పలు ఆసుపత్రుల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకర మల్టీ స్పెషాలిటీస్ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, డాక్టర్ మోహన్ డయాబెటిస్, రమా దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. బీపీ, సుగర్, ఈసీజీ, గ్యాస్ట్రిక్, ఎముకలు, దంత, నేత్ర పరీక్షలు చేస్తారన్నారు. స్త్రీ సంబంధిత సమస్యలకు ప్రత్యేక మహిళా వైద్యులు పరీక్షిస్తారన్నారు. మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందజేయనున్నారని తెలిపారు. వివరాల కోసం 96420 12265, 79939 53701 మొబైల్ నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు కోరారు.

### సత్తెమ్మ తల్లికి గాజుల అలంకరణ



**రాయవరం:** వెదురుపాకలో వేంచేసియున్న సత్తెమ్మ తల్లి ఆదివారం గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. వెదురుపాక–ఆరికరేవుల రహదారిలోని కొర్లవారి సత్తెమ్మ అమ్మవారికి శ్రావణమాసం పురస్కరించుకుని గాజులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పసలపూడికి చెందిన బంగారు శివ ఆయన కుమారులు అజయ్, చంద్రశేఖర్ వితరణతో అమ్మవారికి గాజులు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మాచవరపు వెంకట సురేష్, బర్ల షణ్ముక సూర్య పాల్గొన్నారు.

### బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా

**రాయవరం:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాయవరంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపు మేరకు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గాశ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దుర్గాశ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగుర వేసి స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను భావితరానికి తెలియజేయాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకిరాంబాబు, కోన సత్యనారాయణ, బీజేపీ నాయకులు చిరట్ల సుబ్బారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పబ్లిక్ కుళాయిల సంఖ్య పెంచాలి

**కాజులూరు:** గ్రామంలో పబ్లిక్ కుళాయి సంఖ్యను పెంచేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పల్లిపాలెం ఎంపీటీసీ సభ్యుడు కాశా సత్యనారాయణ తదితరులు కోరుతున్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో పబ్లిక్ కుళాయిలు సరిపడినంతగా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా శివారు గ్రామాలైన ఎస్సీ పేటలో నీట ఎద్దడి మరింత ఎక్కువగా ఉందన్నారు. గ్రామంలో గతంలో అక్కడక్కడా ఉండే చేతిపంపులు, మంచినీటి బావులు శిథిలమయ్యాయని ప్రస్తుతం ప్రజలకు పైపులైను ద్వారా కుళాయిల నుంచి వచ్చే తాగునీరు తప్ప మరో ప్రత్యామ్నాయ అవకాశాలు లేవన్నారు. వేసవి కారణంగా తాగునీటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయన్నారు. గ్రామంలోని ప్రతి వీధిలోనూ కుళాయిలు ఏర్పాటు చేస్తే తప్ప ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పవన్నారు. పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

### సుదీర్ఘకాలం సామాజిక సేవలు ప్రశంసనీయం


శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న బులిస్వామిరెడ్డి

**కపిలేశ్వరపురం (మండపేట):** విరాళాలు స్వీకరించకుండా స్వశక్తితో 30 ఏళ్లుగా సామాజికోన్నతి లక్ష్యంగా కృషి చేస్తున్న ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి సేవలను పలువురు కొనియాడారు. అర్తమూరులో ఆదివారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ట్రస్టు 30వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ బులిస్వామిరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయనతో కేక్ కట్ చేయించారు. ముఖ్య అతిథులుగా అనపర్తి మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, ద్వారపూడి ఆలయ నిర్వాహకులు ఎస్ఎల్ కనకరాజు పాల్గొని బులిస్వామిరెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మెషీన్లు అందజేశారు. మల్లంపూడిలో నిర్వహణలోని సాయిబాబా వృద్ధాశ్రమంలో ఒక గది నిర్మాణానికి ఎస్‌బీఎస్ఆర్ ట్రస్టు ద్వారా రూ.లక్ష చెక్కును నిర్వాహకులు కనకరాజుకు అందజేశారు. అర్తమూరు హైస్కూల్ విద్యార్థులకు శ్రీసత్య లక్ష్మణ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. హాజరైన వారికి మొక్కలు పంపిణీ చేశారు. ట్రస్టు వైస్ చైర్మన్లు వీరరాఘవరెడ్డి, లక్ష్మణరెడ్డి, ట్రస్టు మహిళా విభాగం చైర్మన్ సత్తి శ్రీదేవి, కార్యక్రమ సంధాన కర్త సత్తి రెడ్డి మాస్టారు, ఉద్దగిరి ఆంజనేయులు, ఓగిరెడ్డి రామారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# మండపేట విలీనంపై జేఏసీ సమావేశం

తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని తీర్మానం

**రాయవరం:** మండపేట నియోజకవర్గాన్ని ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని జాయింట్ ఏక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వివిధ రాజకీయ పక్షాల నాయకులు, వివిధ సామాజిక వర్గాల నేతలతో సమావేశం నిర్వహించారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలోనే ఉండాలని కోరుతూ రాయవరం మండలంలోని పంచాయతీలన్నీ ఏకగ్రీవంగా తీర్మానాలు చేయాలని అఖిలపక్షం నేతలు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నేతలు కామన ప్రభాకరరావు, కోన సత్యనారాయణ, కోట వెంకట్రావు, కత్తుల అప్పారావు, ధూళి జయరాజు, వుండవిల్లి రాంబాబు, దేవిశెట్టి చిన్ని, డి.ఆదిలక్ష్మి, సలుమూరి కృష్ణకుమారి పాల్గొన్నారు.

**అభిప్రాయాల సేకరణ**

**కపిలేశ్వరపురం:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేసే అంశంపై కపిలేశ్వరపురం మండలంలోని పలు విభాగాల ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అంగరలోని శ్రీ సత్యనారాయణ కల్యాణ మండపంలో ఆదివారం అఖిల పక్ష కమిటీ చైర్మన్ కామన ప్రభాకరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరయ్యారు. కామన ప్రభాకరరావు మాట్లాడుతూ భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడం ప్రయోజనకరమన్నారు. అదే కోణంలో అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలనూ సేకరిస్తున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన అభిప్రాయాలను మంత్రి వర్గ ఉప సంఘానికి నివేదిస్తామని తెలిపారు. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల ప్రజల సమస్యల కోణంలో శాస్త్రీయ పద్ధతిలో సరైన నిర్ణయం తీసుకోవాలని పలువురు నాయకులు అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, పడమర ఖండ్రిక పీఏసీఎస్ చైర్మన్ పుత్సల శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు డీవీ రాఘవులు, సర్పంచ్ సాకా శ్రీనివాస్, యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు జువ్వల శ్రీనివాస్, న్యాయవాది అల్లూరి రామకృష్ణ చౌదరి, ఉద్యోగుల సంఘం నాయకుడు జిత్తుక మల్లికార్జునుడు పాల్గొన్నారు.


రాయవరం అఖిలపక్ష సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

# ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ’ని విజయవంతం చేయండి

**కాజులూరు:** మండల గ్రామాల్లో ఈ నెల 11వ తేదీ సోమవారం (రేపు) నుంచి జరగనున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం పార్టీ అనుబంధ సంఘాల నాయకులు మండల గ్రామాల్లో పర్యటించి కార్యక్రమానికి హాజరు కావలసిందిగా కార్యకర్తలను ఆహ్వానించారు. చేదువాడలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తెలుగుదేశం నాయకులు వాటిని అమలు చేయలేక అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కూటమి పాలకులు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రతి ఇంటికీ తీసుకువెళ్లేందుకే పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఉమ్మడిగా ఇటింటింకీ వెళ్లి జగనన్న పథకాలు అన్నీ కొనసాగిస్తూ వారికంటే మరిన్ని పథకాలు అదనంగా అమలు చేస్తామని బాండ్లు ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాకర్తలు, నాయకులు ఇప్పుడు ఇంటింటికీ వెళ్లి ఆ బాండ్లలో ఉన్న పథకాలు మీ ఇంట్లో లేదా మీ సన్నిహితులకైనా అందుతున్నాయా అని ప్రజలకు తెలియజేస్తూ క్యూ ఆర్ కోడ్‌ను వారి సెల్ ఫోన్‌లోనే స్కాన్ చేస్తూ బాబు అబద్ధపుమోసాలను తెలియజేయాలన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ తొలి విడత కార్యక్రమంలో భాగంగా సోమవారం మంజేరు, శీల గ్రామాల్లో నాయకులు పర్యటిస్తారన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, జిల్లా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు.


చేదువాడలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమానికి కార్యకర్తలను ఆహ్వానిస్తున్న పార్టీ మండల అనుబంధ సంఘాల నాయకులు

# సమాజ ఉన్నతికి విద్య దోహదం

**కపిలేశ్వరపురం:** మానవ సమాజ ఉన్నతికి విద్య ఎంతగానో దోహదపడుతుందని యూటీఎఫ్ నాయకులు ఉద్ఘాటించారు. కపిలేశ్వరపురంలో ఆదివారం సంఘం 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపాన ఉన్న సంఘం జెండాను మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు, కోశాధికారి జీవీ భీమేశ్వరరావు ఆవిష్కరించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు డీవీ రాఘవులు మాట్లాడుతూ 1974 నుంచి యూటీఎఫ్ పేదలకు విద్యను అందించే దిశగా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు సీహెచ్ వీవీ సత్యనారాయణ, కేవీ రమణ, జిల్లా కౌన్సిలర్ ఎస్ఎస్ఎన్ మూర్తి, నాయకులు శ్రీలత, గోవింద్ కార్యదర్శి వర్గ సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

**యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం**

**రాయవరం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడలి శ్రీనివాస్, జి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న అమలాపురంలోనే యూటీఎఫ్ ఆవిర్భవించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ అవిరళ కృషి చేస్తుందన్నారు. అనంతరం రాయవరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. యూటీఎఫ్ నాయకులు గొలుగూరి మునిరెడ్డి, నల్లమిల్లి భాస్కరరెడ్డి, సీహెచ్.వి.శ్రీరామచంద్రమూర్తి, డీవీఎస్ఆర్‌కే శాస్త్రి పాల్గొన్నారు.


కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

## బీబీ ఉమ్మే కుల్సుమ్‌కు ఘన నివాళి


ద్రాక్షారామలో బీబీ ఉమ్మే కుల్సుమ్ పీరును గుర్రంపై ఊరేగిస్తున్న ముస్లింలు

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ద్రాక్షారామలో ఇమామ్ అలీ రెండో కుమార్తె బీబీ ఉమ్మే కుల్సుమ్ షహదత్ (వర్ధంతి) పురస్కరించుకుని ఆదివారం ముస్లింలు ఘనంగా నివాళి అర్పించారు. మత గురువు మౌలానా మహ్మద్ రఫీ నక్షా పంజాలో మజ్లిస్ ఆలపించారు. ఉమ్మే కుల్సుం పంజా నుంచి బీబీ ఉమ్మే కుల్సుమ్ పీరును గుర్రంపై ఊరేగించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజన వసతి, సౌకర్యాలు కల్పించారు.

# డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న చంద్రబాబు

పిల్లి సూర్యప్రకాశ్

**రామచంద్రపురం రూరల్:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయలేక సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ మండలంలోని యనమదల, తాడిపల్లి గ్రామాల ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంపన వీరవెంకటరమణ, పిల్లి అచల రాజశ్రీ, ఎంపీటీసీలు నురుకుర్తి శ్రీరామకృష్ణ, రెడ్నం సతీష్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి సూర్యప్రకాశ్ ఆదివారం చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రబాబు మోసపు హామీలు గుప్పించి ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరవాత మేనిఫెస్టోలు అమలు చేయకపోగా ప్రశ్నించిన వారిని పోలీసు కేసులతో వేధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ మండల అధ్యక్షుడు పోలినాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, నాయకులు పిల్లి బాలసుబ్రహ్మణ్యం, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, బంగారుబాబు, గీసాల గోపి ఆయా గ్రామాల పెద్దలు, మహిళలు, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


యనమదలలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న సూర్యప్రకాశ్

# చింతలతోట కాలనీలో పోలీసుల తనిఖీ

**రాయవరం:** చెల్లూరు శివారు చింతలతోట కాలనీలో పోలీసులు ఆదివారం కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు, డీఎస్పీ బి.రఘువీర్ పర్యవేక్షణలో ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్సై డి.సురేష్‌బాబు సిబ్బందితో కలసి కార్డన్ అండ్ సెర్చ్ చేపట్టారు. ప్రశాంతంగా ఉన్న ఆవాస ప్రాంతాల్లోకి చొరబడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా పక్షులు వేటాడేందుకు నాటు తుపాకీలు కలిగి ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఉపాధి పనుల నిమిత్తం గ్రామంలో కొత్తగా వచ్చిన వారి వద్ద ఏమైనా అనుమానాస్పద వస్తువులు కలిగి ఉంటే వెంటనే సమాచారమివ్వాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే నేరాలను కట్టడి చేయగలమన్నారు. ఇంటింటికీ వెళ్లి ఇళ్లలో తనిఖీలు చేపట్టి, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో అంగర ఎస్సై హరీష్ కుమార్, మండపేట నియోజకవర్గ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.


చింతలతోట కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

# వరిలో కలుపు.. అన్నదాతకు దిగులు

- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- కలుపుతీత పనుల్లో రైతులు నిమగ్నం
- అధికమవుతున్న పెట్టుబడి

**రాయవరం:** వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వర్షపాతం వైవిధ్యం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, వేడి వాతావరణం కారణంగా పంట ఉత్పత్తులు తగ్గే అవకాశం ఉంది. ఖరీఫ్‌లో ఈ ఏడాదైనా మంచి దిగుబడులు సాధించాలన్న ఆశతో సాగు ప్రారంభించిన రైతులు ఆది నుంచి అవస్థలు ఎదుర్కొంటున్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడంతోపాటు వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. ఎట్టకేలకు జులై నెలాఖరు వరకు రైతులు వరినాట్లు వేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం వరి పైరు పంట ఆరోగ్యంగానే ఎదుగుతున్నా కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పంటకు నష్టం కలగజేస్తాయన్న భయం అన్నదాతలను వెంటాడుతోంది. ప్రస్తుతం ఎండలు మండు వేసవిని తలపించడంతో వరి పైరులో కలుపు అధికంగా పెరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**1.01 లక్షల ఎకరాల్లో వరి సాగు**

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 90 శాతం మేర రైతులు స్వర్ణ రకాన్ని సాగు చేస్తున్నారు. మిగిలిన 10 శాతం ఇతర రకాలను సాగు చేస్తున్నారు. ముందుగా బోర్లపై వరినాట్లు వేసిన చోట వరి పంట దుబ్బు కట్టే దశకు చేరుకుంది. ఈ ఏడాది ఆదిలోనే వర్షాభావం నెలకొంది. జూన్‌లో ఓ మోస్తరుగా వర్షాలు కురిశాయి. ఈ ఏడాది మేలో జోరుగా వర్షాలు కురిశాయి. జూలై, ఆగస్టు నెలల్లో దుక్కి వర్షం కూడా కురవకపోవడంతో వర్షాభావ ప్రభావం వరి పంటపై ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభావం చూపని కలుపు నివారణ మందులు**

రైతులు కలుపుతీత పనుల్లో బిజీగా ఉన్నారు. వరి పైరు దుబ్బు కట్టే దశలో ఉన్నందున కలుపుతీత పనులు ముమ్మరంగా చేస్తున్నారు. బోర్లపై ఆధారపడి సాగు చేపట్టిన రైతులు జూన్‌లోనే వరినాట్లు వేశారు. క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాల్లో బోర్లపై వరి నాట్లను వేశారు. ముందుగా వరి నాట్లు వేసిన చోట మూన దశ నుంచి దుబ్బుకట్టే దశకు పైరు చేరుకుంది. ఇప్పటికే పలువురు రైతులు కలుపు నివారణ మందులను వాడుతున్నా అంతగా ప్రయోజనం కనిపించడం లేదు. అధికంగా కలుపు పెరిగిన పంట చేలల్లో ఆర్థికభారమైనా తప్పని సరి పరిస్థితుల్లో రైతులు కూలీలతో కలుపు తీయిస్తున్నారు. పంట పొలంలో కలుపు ఎక్కువగా ఉంటే వేసిన ఎరువులు అక్కరకు రావనే ఉద్దేశ్యంతో రైతులు కలుపుతీతకు ప్రాధాన్యమిస్తున్నారు.

**రైతులు పాటించాల్సిన సూచనలు**

ఆలస్యంగా వరి నాట్లు వేసిన రైతులు ప్రతి రోజు చేలల్లో నిల్వ నీటిని తీసి కొత్త నీటిని పెట్టాలి. అధిక ఉష్ణోగ్రతకు చేలల్లో ఉన్న నీరు వేడెక్కితే వరి దుబ్బు పిలకలు కట్టదు. పైరు ఎదుగుదల తక్కువగా ఉంటుంది. రైతులు ప్రతి రోజూ నీటిని మార్చడం వలన పైరు ఎదుగుదల బాగుంటుంది. వరినాట్లు వేసిన 15 రోజుల్లోగా పైపాటుగా వేసే కాంప్లెక్స్ ఎరువులు పూర్తిచేయాలి. పొటాష్ ఎకరానికి 15 కేజీలు వేస్తే రోగనిరోధక శక్తి పెరిగి తెగుళ్లు, పురుగుల బారి నుంచి పైరు తట్టుకుంటుంది. వరి నాటిన 30రోజుల వరకు పురుగు మందులు వాడరాదు. ప్రారంభ దశలో పురుగు మందులు వాడితే మిత్ర పురుగులు చనిపోతాయి.


వెదురుపాక వరిచేలల్లో కలుపు తీస్తున్న కూలీలు

# మహిళల ఉచిత ప్రయాణానికి డిపో సిద్ధం

**రామచంద్రపురం రూరల్:** ఈ నెల 15 నుంచి ప్రభుత్వం ప్రకటించిన విధంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రామచంద్రపురం ఆర్టీసీ డిపో సిద్ధంగా ఉన్నట్లు డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు డిపోలోనే నిర్దేశిత కిలోమీటర్ల ప్రయాణం పూర్తి చేసుకున్న 5 సూపర్ లగ్జరీ బస్సులు, 4 అల్ట్రా డీలక్స్ బస్సులను గడచిన మూడు నెలలుగా మహిళ ఉచిత ప్రయాణానికి అనుకూలంగా ఉండే విధంగా పల్లె వెలుగు బస్సులుగా మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. వీటితో టెస్ట్ డ్రైవింగ్‌లు కూడా చేసిన తరువాత పూర్తి స్థాయిలో ఉపయోగించడం జరుగుతుందన్నారు. డిపో పరిధిలో రోజూ 52 బస్సులతో 18,238 కిలోమీటర్లు ప్రయాణికులను చేరవేస్తున్నట్లు తెలిపారు. వీటిలో 47 బస్సులు అంటే 90 శాతం బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చని వివరించారు. దీనికోసం ప్రయాణికులకు ఆయన కొన్ని సూచనలు చేశారు. బస్సు ఎక్కడానికి గానీ దిగడానికి కానీ బస్ షెల్టర్ ఉన్న ప్రదేశాలు మాత్రమే ఉపయోగించాలని, వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్నప్పుడు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. బస్సు ఫుట్‌పాత్‌పై నిలబడి ప్రయాణం చేయకూడదన్నారు. డ్రైవర్, కండక్టర్‌లకు సహకరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.


పల్లె వెలుగు బస్సుగా మార్చిన సూపర్ డీలక్స్ బస్సుతో డిపో మేనేజర్ భాస్కరరావు, సిబ్బంది